# పరి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**బాపట్ల. ఫిబ్రవరి 21. ప్రభాతవార్త:** పరిశుభ్రమైన పరిసరాలతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బాపట్ల జిల్లా ఇంఛార్జి కలెక్టర్ భావన వశిష్ట పేర్కొన్నారు. శనివారం చీరాల పట్టణంలో నిర్వహించిన "స్వర్ణాంధ్రస్వచ్ఛ




ఆంధ్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రైల్వే స్టేషన్ నుండి ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "వ్యర్థ రహిత పాలనపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, అధికారులతో కలిసి సమైక్యతను చాటుతూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి కలెక్టర్ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ సొంత ఇంటిని ఎంత జాగ్రత్తగా శుభ్రం చేసుకుంటామో, మన వీధులను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. దేశాభివృద్ధిలో స్వచ్ఛత కీలకమని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. రేపటి పౌరులైన విద్యార్థులు పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకుని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదు: ఆర్డీవో చంద్రశేఖర్ చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. మార్గమధ్యలో ఉన్న టిఫిన్ సెంటర్లు, హోటళ్ల నిర్వాహకులకు పరిశుభ్రతపై ఆయన స్వయంగా అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ కే. డానియల్ జోసెఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం "స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. హోటళ్లు, వాణిజ్య సంస్థలు ప్లాస్టిక్ రహితంగా మారాలని సూచించారు. జాబ్ మేళా పోస్టర్ల విడుదల:ఇదే వేదికపై ఈనెల 26వ తేదీన రేపల్లెలో నిర్వహించనున్న జిల్లా స్థాయి జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రాలను ఇంఛార్జి కలెక్టర్ విడుదల చేశారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి. సుబ్బయ్య, సిపిఓ షాలేము రాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ మాధవి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలను దెబ్బతీసినందుకు జగన్ క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రదర్శించిన తీరు సభ్య సమాజం వ్యతిరేకిస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శాసనమండలిలో (వైసీపీ) నేతలు వేంకటేశ్వరస్వామి ఫొటోలు చేతబట్టి, కాళ్లకు చెప్పులు మరియు షూలు వేసుకుని నినాదాలు చేస్తూ సభలోకి రావడం క్షమించరాని నేరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. దేవుడి ఫొటోలను సభలో ప్రదర్శిస్తూ గలాటా చేయడం, అనంతరం మండలి వాయిదా పడిన వెంటనే వాటిని టేబుల్లపై విసిరేయడం అత్యంత అవమానకరమని అన్నారు. హిందువుల కోట్లాది మనోభావాలను కించపరిచేలా వైసీపీ సభ్యులు ప్రవర్తించారని, దేవదేవుడైన వేంకటేశ్వరస్వామికి మహాపరాధం చేశారని గళ్ళా మాధవి మండిపడ్డారు. దేవుడంటే భయం, భక్తి లేకుండా వ్యవహరించడం వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మంత్రులు సభలో మాట్లాడుతున్నప్పటికీ వినకుండా, చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేయడం ద్వారా మండలిని ఆర్డర్‌లో ఉండనివ్వకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించారని గళ్ళా మాధవి ఆరోపించారు. చట్టసభలను గతంలో అవమానించిన వారే ఇప్పుడు ఆధ్యాత్మిక విశ్వాసాలను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.



దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజారారని, హిందువుల మనోభావాల పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి గౌరవం లేదని, హిందువులను అవమానించినందుకు జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవుడితో రాజకీయ ఆటలు ఆడవద్దని ఒకవైపు మంత్రులు సూచించినా, ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం వైసీపీ వికృత రాజకీయాలకు నిదర్శనమని, శాసనమండలి సాక్షిగా తమ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుణ్ని కూడా వాడుకుంటామని వైసీపీ నేతలు రుజువు చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్సీల ప్రవర్తన యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉందని, భవిష్యత్‌లో ప్రజలు వారికి తగిన బుద్ధి చెబుతారని గళ్ళా మాధవి హెచ్చరించారు

# ఎస్పీకు ఘన సన్మానం

**గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి21,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అత్యంత వైభవంగా జరిగిన శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి



(క్వారీ) వడ్లమూడి తిరునాళ్ల ఉత్సవాలకు సంబంధించి, అత్యుత్తమ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ని దేవస్థాన అధికారులు,పోలీసు అధికారులు కలిసి ఘనంగా సన్మానించారు. శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) నరసింహారావు, చేబ్రోలు ఈఓ వినాయక కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,అర్చకులు కృష్ణమూర్తి ఎస్పీని కలిసి వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు. తిరునాళ్లలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో,భద్రత కల్పించడంలో ఎస్పీ చూపిన చొరవను వారు కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీకి శాలువా కప్పి, ఘనంగా సన్మానం చేశారు. ప్రసాదము అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో తెనాలి డిఎస్పీ,పొన్నూరు రూరల్ సిఐ,పొన్నూరు ఎస్సై పి.వి. నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్ల వంటి పెద్ద ఉత్సవాల నిర్వహణలో పోలీసు శాఖతో పాటు దేవస్థాన కమిటీ సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భక్తులందరూ సురక్షితంగా స్వామివారిని దర్శించుకునేలా కృషి చేసిన పోలీసు అధికారులను,సిబ్బందిని ఆయన అభినందించారు.

## గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ఆర్‌వీఆర్ జెసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులను అభినందించిన సిఎం చంద్రబాబు

**గుంటూరు విద్య ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రపంచ దేశాలు మెచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఢిల్లీ వేదికగా ఈ నెల 16 నుండి నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏ.ఐ సమ్మిట్ లో పాల్గొన్న ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు పఠాన్ రాఫియా, ధూళిపాళ్ల నేహ ఈ ఏ.ఐ సమ్మిట్ కు హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. సమ్మిట్‌లో భాగంగా విద్యార్థినులు వివిధ సాంకేతిక సెమినార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన ఎక్స్‌పోలు సందర్శించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృత అవగాహన పొందారు. ఐటి రంగంలోని ప్రముఖ సంస్థల నిపుణులు మరియు టెక్నాలజీ దిగ్గజాలతో సమావేశమై భవిష్యత్ సాంకేతిక ధోరణులు, ఆవిష్కరణలు, పరిశోధన అవకాశాలపై విలువైన సమాచారం తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాల్గొన్న ఐటి నిపుణుల సందేశాలు, వారి ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు మరియు స్టార్టప్ అవకాశాలపై పొందిన అనుభవం తమ విద్యా ప్రస్థానానికి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని విద్యార్థినులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా కలుసుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని, "స్వర్ణాంధ్ర" లక్ష్య సాధనలో తమ వంతు బాధ్యత నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పఠాన్ రాఫియా, ధూళిపాళ్ల నేహ పేర్కొన్నారు. సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన తిశిగిలీ స్టాల్‌ను సందర్శించి ప్రభుత్వ సాంకేతిక సేవలు, డిజిటల్ ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా విద్యార్థినులు గ్లోబల్ స్థాయి పరిజ్ఞానం సంపాదించడంతో పాటు భవిష్యత్ వృత్తి జీవితానికి ఉపయోగపడే




అనుభవాన్ని పొందుతారని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని తెలిపారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సులో తమ విద్యార్థులు పాల్గొనడం కళాశాలకే గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, రాఫియా, నేహలను అభినందించారు.

## నేడు సీఎం పర్యటించే రహదారులను పరిశుభ్రంగా ఉంచాలి

### అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21, (ప్రభాతవార్త) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం గుంటూరు నగరానికి రానున్నారని ఆయన రోడ్డు మార్గంలో సత్య సాయి స్పిరిచువల్ సొసైటీ ట్రస్టు ప్రాంగణంలో పోస్టల్ డిపార్ట్మెంట్ కార్యక్రమానికి హాజరుకానున్నారని కమిషనర్ కే మయూర్ అశోక్ తెలిపారు. ఆయన ఎలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో ట్రస్టు దగ్గరికి వెళ్లే వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, వ్యర్థాలను తొలగించాలని, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని, కార్పొరేషన్ లో ప్రతి ఒక్క అధికారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం శనివారం ఆ రోడ్డు మార్గాలను తనిఖీ చేశారు. యుద్ధప్రాతిపదిగిన ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.



# భారతీయ కళా వైభవాన్ని చాటుతున్న ప్రదర్శన

**గుంటూరు విద్య ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** 1964లో స్థాపించబడిన వారసత్వ సంస్థ పీఎంజే , గుంటూరులోని విద్యానగర్ లో మూడు రోజుల పాటు జరిగే అతిపెద్ద ప్రదర్శనను విజయవంతంగా నిర్వహిస్తోంది. భారతీయ కళ వైభవాన్ని ఈ ప్రదర్శన చాటుతుంది. నమ్మకం, సంప్రదాయం మరియు కళానైపుణ్యంలో పీఎంజే జువెల్స్ కలిగి ఉన్న గొప్ప వారసత్వాన్ని మరోసారి చాటిచెబుతోంది. పీఎంజే జువెల్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజినెస్ హెడ్ హైదర్ అలీ, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్ కృష్ణ చైతన్య తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శన ఆవిష్కరించారు .

## మునుకుళ్ల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**తిరువూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా, తిరువూరు మండలంలోని మునుకుళ్ల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు జక్కేపల్లి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించబడింది. విద్యార్థిని విద్యార్థులకు మాతృభాష ప్రాధాన్యత నేర్చుకోవాల్సిన ఆవశ్యకత మరింత పటిష్ట పరచవలసిన విషయాన్ని తెలియజేశారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని భరత కుమారి విద్యార్థిని విద్యార్థులకు మాతృభాష గొప్పతనం గురించి వివరించి చక్కటి కవితను వినిపించారు. మాతృభాషలో నేర్చుకున్న విషయాలు త్వరగా అవగాహన అవుతాయని తెలియజేశారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మాతృభాషా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థిని విద్యార్థులకు ఆంగ్ల



పదాలు ఉపయోగించకుండా తెలుగులో మాట్లాడటం అనే అంశం మీద పోటీ నిర్వహించడం జరిగింది. పోటీల్లో గెలుపొందిన వారికి కిరణ్మయి, నందు, సంజన, రామ్ చరణ్, సాత్విక్ రెడ్డిలకు బహుమతి ప్రధానం చేశారు.

# సాంకేతిక ప్రతిభకు సాంస్కృతిక శోభ సుప్రజ్ఞ2కె26

**పెనమలూరు ఫిబ్రవరి21,ప్రభాతవార్త :** విద్యార్థులు జ్ఞానయుక్తమైన ధైర్యాన్ని,అనుకూలత,జీవితాంతం నేర్చుకునే తత్వం కలిగి ఉండాలని అప్పుడేవారు అత్యున్నతస్థానంకు చేరడానికి విజయమార్గంలో



పయనించడానికి విద్య వృత్తి రంగాలలో ప్రతిభను సాధించగలరని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ ఎస్.జి.దేశ్‌ముఖ్ అన్నారు. కానూరు సిద్దార్థ యూనివర్సిటీలో రెండురోజుల జాతీయస్థాయి సాంకేతిక సాంస్కృతిక మహోత్సవం ఎస్.యు.ప్రజ్ఞ2కె26 విజయవంతంగా శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగు విద్యార్థులకు తమ నైపుణ్యాలు ప్రతిభ మరియు సృజనాత్మకతను ప్రదర్శించుకునేందుకు ఇవి ప్రత్యేక వేదికలని హర్షం వ్యక్తం చేసారు. గౌరవ అతిథులు శ్రీమతి షిప్రాచట్రా,పి.వి.యస్.సురేష్ మాట్లాడుతూ విద్యతో మానవసంబంధాలపట్ల ప్రాముఖ్యత విస్తృత దృక్పథం,చాతుర్యంతో పనిచేయడం వంటి విలువైనవి విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి మహోత్సవాలు విద్యార్థులలో స్నేహతత్వాన్ని, సోదరభావాన్ని, ఐక్యతను,సహకారతత్వాన్ని వారిలో కలుగజేస్తాయని తెలిపారు. ప్రో వైస్ ఛాన్స్‌లర్ ఏ.వి.రత్నప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులలో సామర్థ్యాలు, సృజనాత్మకత నాయకత్వలక్షణాలను వెలికితీసేందుకు ఈవేడుకలు దోహదపడతాయని తెలిపారు. 15విశ్వవిద్యాలయాలు 50సంస్థల నుండి 2000మంది విద్యార్థులు వివిధ పోటీల ప్రదర్శనల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈపోటీలలో సామూహిక సాంప్రదాయ సాహిత్య సాంస్కృతిక నృత్యాలు అంబరాన్నంటాయి. పోటీలలో విజేతలుగా నిలిచిన పలు విభాగాల విద్యార్థులకు రూ10లక్షల రూపాయల బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవిచంద్,ఎస్.యు.ప్రజ్ఞ కన్వీనర్ వి.మల్లిఖార్జున్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టరు బి.పాండురంగా రావు,విభాగాధిపతులు అధ్యాపకబృందం పాల్గొన్నారు.

## డాక్టరు పట్టాను అందుకున్న విశ్వనాథపల్లి యామిని

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** విజయవాడ, గుణదలకు చెందిన విశ్వనాథపల్లి యామిని డాక్టరు పట్టాను డీన్ డాక్టర్ ఆనందాచారి,డాక్టర్ వరదా మేడమ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(కిమ్స్),అమలాపురంలో డాక్టరేట్ పూర్తి చేసి తన కోరికను ఆమె తీర్చుకుందని,మధ్య తరగతి కుటుంబంలో నుండి వచ్చినప్పటికి తన కుటుంబ సభ్యులు గర్వించేలా డాక్టరు పట్టాను అందుకుని అందరికీ ఆదర్శంగా నిల్చిందని వక్తలు కొనియాడారు. అంతేకాక చిన్ననాటి నుండి డాక్టర్ అవ్వాలనే కోరికతో ఉన్నత పాఠశాల అయిన సెంట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పట్టుదలతో చదివి 9.7% మార్కులతో ఉత్తీర్ణులైందన్నారు. నీట్ ఎగ్జామ్‌లో బోటనీ లెక్చరర్(అబ్దుల్ సుభాని(లేటు) ప్రోత్సాహంతో మంచి ఉత్తీర్ణత సాధించిందని,పట్టుదల క్రమశిక్షణతో కిమ్స్‌లో డాక్టరేట్ పూర్తి చేసి,ఆమె తల్లిదండ్రులైన వివిఎస్ఎన్ మూర్తి,కనకదుర్గలు గర్వించేలా చేసిందని ఆమెను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో పాటు లెక్చరర్లు పాల్గొన్నారు.

## అనాసాగరం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర

**నందిగామ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నందిగామ మున్సిపల్ కమిషన్ లోవా రాజ్ తెలియపరిచారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమ భాగంగా



అనాసాగరం పాఠశాల తరగతి గదులను పరిశుభ్రతపరిచారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ వచ్చిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు మున్సిపల్ కమిషనర్ లోవరాజ్ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. స్వచ్ఛం ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ విద్యార్థులచే చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అనాసాగరం తెలుగు దేశం పార్టీ నాయకులు దుగ్గిదేవి గోపి కృష్ణ మాట్లాడుతూ స్కూల్ పరిసరాలు తరగతి గదులు చాలా పరిశుభ్రంగా ఉన్నాయని ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు దుగ్గిదేవి గోపి కృష్ణ, జనసేన పార్టీ నాయకులు 20 వార్డ్ కౌన్సిలర్ తాటి వేంకట కృష్ణ, నందగామ సొసైటీ చైర్మన్ కొట్టే హరి కృష్ణ, రామిరెడ్డి వీరబాబు. ప్రధానోపాధ్యాయులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

**నందిగామ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శాఖ గ్రంథాలయం, నందిగామ నందు ఘనంగా నిర్వహించడమైనది, ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లూరి రామచంద్రుడు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొనడం అయినది. గ్రంథాల అదికారి రామచంద్రుడు మాట్లాడుతూ యునెస్కోవారు 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలనే



నిర్ణయించినారని, ఫిబ్రవరి 21,2000 సంవత్సరం నుండి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నారని, ప్రతి ఒక్కరు వారి మాతృభాషను గౌరవించుకోవాలని అలాగే తెలుగు పుస్తకాలను చదువుకోవాలని, భాష చనిపోతే, మన సంస్కృతి చనిపోయినట్లేనని, మన ఉనికికి, మన సంస్కృతి మూలం మన భాష, అమ్మ ఇచ్చే పిలుపులో ఎంత మాధురియం ఉంటుందో, మన మాతృభాషలో మాట్లాడటం వల్ల కూడా అంతే స్వచ్ఛత ఉంటుందని, గాలి, నీరు మన ప్రాణానికి ఎంత అవసరమో మన భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష చరిత్రను చాటి చెబుతుందని, ఏదైనా విషయాన్ని మనం మాతృభాషలో నేర్చుకోవటం ద్వారా త్వరగా అర్థమవుతుందని, మన పండగలో సాంప్రదాయాలు పాటలు అన్నీ మన భాషలో ఇమిడి ఉన్నాయని, దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కొనియాడారని గ్రంథాల అధికారి విద్యార్థులకు వివరించడమైనది, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడమైనది, అనంతరం విద్యార్థులచే తెలుగు పద్యములు చెప్పించడం అయినది.

## టెన్త్ విద్యార్థులకు "క్విక్ రివిజన్ గైడ్ ఆవిష్కరణ

**విజయవాడ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఏపీ సచివాలయంలోని ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో శనివారం పదవ తరగతి సైన్స్ విద్యార్థుల కోసం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆంధ్రప్రదేశ్ కమిటీ రూపొందించిన "క్విక్ రివిజన్ గైడ్" పుస్తకాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, డిప్యూటీ డైరెక్టర్ ప్రతిభ, గిరిజన నాయకులతో కలిసి విడుదల చేశారు. గిరిజన



విద్యార్థులు త్వరగా రివిజన్ అయ్యేలా, విద్యా ప్రమాణాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ గైడ్ సిద్ధం చేయబడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పుస్తకాలను రాష్ట్రంలోని ఏపీ గిరిజన రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రిన్సిపల్ సెక్రటరీకి ఏపీ గిరిజన రెసిడెన్షియల్ గా మారిన హాస్టళ్ల పాఠశాలల్లో ఫిజిక్స్ మరియు బయాలజీ సబ్జెక్టులకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ

## సిబిఎస్సిఈగా గుర్తింపు పొందిన ఏకత్వ స్కూల్

**వీరులపాడు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** సిబిఎస్సి గుర్తింపు పొందినందుకు గాను కంచికచర్ల ఏకత్వ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి తంగిరాల సౌమ్య శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంచికచర్లలో గత సంవత్సరం స్థాపించబడి, స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అనేక క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి కంచికచర్ల విద్యారంగ సౌరభ సుగంధాలను దిశదిశగా వ్యాపింప చేసిన ఏకత్వ పబ్లిక్ స్కూల్



స్థాపించిన రెండవ సంవత్సరంలోనే నర్సరీ నుండి 12 వ తరగతి నిలబెట్టుకున్న ఏకత్వ యాజమాన్యం అయిన అమరనేని రమేష్ బాబు, అమరనేని జ్యోతి, అమరనేని మనోజ్, అమరనేని సింధూర, అమరనేని కార్తీక్, అమరనేని శాంతిప్రత్యుషలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వారి కార్యాలయంలో అభినందనలు తెలియజేసి భవిష్యత్‌లో ఎన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆశించారు.

## అమ్రిత సాయిలో ఫ్రెషర్స్ డే సంబరాలు

**కంచిచర్ల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కంచికచర్ల మండల పరిటాల సమీపంలోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కె.రామమోహన్ రావు తెలియచేసారు. ఈ ఫ్రెషర్స్ డే కార్యక్రమాలను కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కె.రామ మోహన్ రావు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ యం శశిధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కె.రామ మోహన రావు మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరంలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా ఒక ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చునని తెలిపారు. కళాశాలలో అకడమిక్ ప్రోగ్రాం తో పాటు టెక్నికల్,స్కిల్ అండ్ జాబ్



ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలియచేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ మరియు బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇప్పటికే 20 కంపెనీలలో 414 మంది ఉద్యోగాలు సాధించటం తో పాటు 8 లక్షల అత్యధిక వార్షిక వేతనం తో సత్తా చాటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులను మార్గదర్శకంగా తీసుకోవాలని, కళాశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ క్లబ్స్ ద్వారా సీనియర్ విద్యార్థులు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, తద్వారా వారిలో లీడర్ షిప్ మరియు మేనేజింగ్ స్కిల్క్‌తో పాటు ఆత్మ విశ్వాసం వంటి అంశాలు పెంపొందించు కోవచ్చునని తెలిపారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకుని ఇండస్ట్రీ అవసరాలకు తగినట్లుగా సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంప్రదాయ నృత్యాలను, నాటికలను, పలు చలన చిత్రాల గీతాలను, పాటలను ఆలపించి ప్రదర్శించారు. ముఖ్యంగా రీమిక్స్ సాంగ్స్‌కు విద్యార్థులు ఉత్సాహంతో కేరింత తో స్టెప్స్ వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.చిరంజీవి అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

